క్లుప్తంగా

8న జగనన్నకు చెబుదాం

కార్వేటినగరం: కార్వేటినగరంలో 8వ తేదీ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, జిల్లా కలెక్టర్, జిల్లా, మండలస్థాయి అధికారులు, పాల్గొంటారని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వినతి రూపంలో అధికారులకు విన్నవించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కరుమారియమ్మకు ప్రత్యేక పూజలు



నింద్ర: మండల కేంద్రం నింద్రలో వెలసిన ఓంశక్తి ఆలయం వద్ద కరుమారియమ్మ దేవతకు ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. స్థానిక భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

నగరిలో జోరు వాన



నగరిలో కురుస్తున్న వర్షం

నగరి : పట్టణ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జోరువర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. వరుణుడు దోబూచులాడుతూ వచ్చాయి. అయితే ఆదివారం మధ్యాహ్నం మాత్రం కుండపోత వర్షం పడింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు నీటితో నిండాయి. పాత నివాసాల్లో ఇదివరకు నీళ్లు ఉరవని ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు ఉరిసింది.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో కాలువలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్లపైకి చేరింది. పలుచోట్ల భారీగా వర్షం పడడంతో పంటలకు తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉందని పలువురు రైతులు తెలిపారు.

అండర్-14 క్రికెట్ సెలక్షన్స్ ప్రారంభం



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జయప్రకాష్

పుత్తూరు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలుర అండర్-14 క్రికెట్ సెలక్షన్స్‌ను ఆదివారం స్థానిక ఎస్ఆర్ఎస్ జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రతి క్రీడాకారుడు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారుల నుంచి జిల్లా ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేశారు. వీరికి నగరిలో రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం సుందరం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేష్, సర్పంచ్ కృపాకరన్, పీడీలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు విశేష స్పందన



వీఆర్ కుప్పం పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం : మండలంలో నిర్వహించిన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని తహసీల్దార్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన వెంగళరాజుకుప్పం, వనదుర్గాపురం, ఆముదాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటరు నమోదు ప్రక్రియను తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించారు. ఓటర్ల నమోదుకు 47, మృతులకు సంబంధించి 35 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఆలయాలకు మహర్దశ



నగరిలో పునర్నిర్మాణంలో ఉన్న దేశమ్మ ఆలయం



కాకవేడు ఆదిఆంధ్ర వాడలో నిర్మించిన మాతమ్మ ఆలయం



పుత్తూరులో ద్రౌపదమ్మ ఆలయానికి నిర్మించిన రాజగోపురం

- గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆలయాలకు నిరాదరణ
- ప్రస్తుత ప్రభుత్వంలో ఆలయాల నవీకరణ, కొత్త ఆలయాల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నగరి : గత టీడీపీ పాలనలో నిరాదరణకు గురైన ఆలయాలకు ప్రస్తుతం మహర్దశ వచ్చింది. ఎండోమెంట్‌లోని ఆలయాలను నవీకరించడంతో పాటు, టీటీడీ నిధులతో కొత్త ఆలయాలు నిర్మిస్తున్నారు. ప్రాచుర్యం ఉన్న ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకువస్తున్నారు. మంత్రి ఆర్కేరోజా చొరవతో నగరి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సుమారు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. అలాగే కొత్త ఆలయాల నిర్మాణాలు చేపట్టారు.

రూ.1.20 కోట్లతో దేశమ్మ ఆలయ పునర్నిర్మాణం

నగరి మున్సిపాలిటీ, టీఆర్ కండ్రిగలో నేత్రదేవతగా ప్రసిద్ధి చెందిన దేశమ్మ ఆలయాన్ని రూ.1.20 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. నేత్రాలను ప్రసాదించే దేవతగా దేశమ్మ ప్రాచుర్యం పొందింది. ఇక్కడికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆడి ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆలయ ప్రాకారం చిన్నదిగా ఉండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దేశమ్మ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేయించారు. ఈ క్రమంలో గోపురం, ముఖమండపం, గర్భగుడి, పోతురాజ ఆలయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే పొంగళ్ల షెడ్డు, వసతి గదులు, కల్యాణకట్ట, కోనేరు పనులు పూర్తయ్యాయి.

రూ.50 లక్షలతో పుత్తూరులో ఆలయాల అభివృద్ధి

పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయ రాజగోపురాన్ని రూ.25 లక్షలతో నిర్మించారు. అమ్మవారి గర్భగుడిని ఆధునీకరించారు. అలాగే పట్టణ నడిబొడ్డులోని పుష్కరిణి ఆధునీకరణకు రూ.25 లక్షలు మంజూరు చేయించారు. పుష్కరిణి ఆధునీకరించడంతో పాటు చుట్టూ గార్డెన్, స్టేజ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

కాకవేడు ఆధిఆంధ్రవాడలో మాతమ్మ ఆలయ నిర్మాణం

నగరి మున్సిపాలిటీ కాకవేడు ఆధిఆంధ్రవాడలో మాతమ్మ ఆలయాన్ని నిర్మించారు. గతంలో ఆలయానికి సంబంధించిన స్థల వివారం కోర్టులో ఉంది. దీన్ని ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించి 10 సెంట్ల భూమిని కేటాయించింది. మంత్రి ఆర్కేరోజా చొరవతో టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీంతో నూతన ఆలయం నిర్మించారు.

విజయపురం ఎస్టీ కాలనీలో పెదపాళెమ్మ ఆలయం

విజయపురం ఎస్టీ కాలనీలో పెదపళ్లెమ్మకు తడికలతో కట్టిన చిన్న ఆలయం మాత్రమే ఉండేది. నాలుగు దశాబ్దాలుగా అందులోనే పూజలు చేస్తున్నారు. పక్కా ఆలయాన్ని నిర్మించాలన్న కోరిక కలగానే మిగిలింది. మూడేళ్ల క్రితం మంత్రి ఆర్కేరోజా టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించగా ఆలయం నిర్మించారు.

ముడిపల్లి దళితవాడలో రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయం

మండలంలోని ముడిపల్లి దళితవాడలో శిథిలావస్థకు చేరుకున్న రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయాన్ని పునర్నిర్మించుకోవాలన్న స్థానికుల దశాబ్దాల కోరిక మంత్రి రోజా చొరవతో నెరవేరింది. ఆలయ నిర్మాణానికి టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

రూ.1.70 కోట్లతో నింద్ర ప్రసన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి

నింద్రలో చారిత్రక విశిష్టత కలిగిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రూ.1.70 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో నాలుగు దశాబ్దాల క్రితం వరకు నిత్య పూజలు జరిగేవి. ఆలయంలో జరిగిన తవ్వకాల్లో అప్పట్లో 5 పంచలోహ విగ్రహాలు బయటపడగా వాటిని అధికారులు ట్రెజరీకి తరలించారు. ఒక పెద్ద రాతి విగ్రహం బయటపడగా పురావస్తు శాఖ చెన్నై మ్యూజియంకు తరలించింది. ఊరి మధ్యలో ఉన్న ఇంతటి ప్రసిద్ధి చెందిన ఆలయం అభివృద్ధికి నోచుకోకపోవడంతో శిథిలావస్థకు గురైంది. దీనికి పూర్వ వైభవం తీసుకురావాలన్న స్థానికుల కోరిక మేరకు మంత్రి ఆర్కేరోజా రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు.

ఆలయాలకు మరిన్ని వసతులు

- అర్జునప్ప కండ్రిగలో రూ.7.5 లక్షలు మంజూరు చేయించి కనకదుర్గమ్మ ఆలయాన్ని ఆధునీకరణ చేస్తున్నారు.
- బుగ్గఅగ్రహారంలో వన్నూరమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి చేర్చడం. ఏఏడబ్ల్యూలోని మాతమ్మ ఆలయానికి రాతి, పంచలోహ విగ్రహాలు, రేడియో సెట్ ఇప్పించడం.
- సత్రవాడ కరివరదరాజ ఆలయానికి టీటీడీ పర్యాటక బస్సు వెళ్లే ఏర్పాటుచేయడం.
- కరకంతాపురంలోని రామాలయానికి రామ, లక్ష్మణ, సీతా, హనుమంత పంచలోహ విగ్రహాలు టీటీడీ ద్వారా అందజేయడం.
- నగరి కరకంతేశ్వర, పుత్తూరు సదాశివేశ్వర స్వామి ఆలయాలకు ఇప్పటికే రూ.4 లక్షల విలువజేసే నంది వాహనాలు అందజేశారు.



నింద్ర ప్రసన్న వేంకటేశ్వర ఆలయం వద్ద పునర్నిర్మాణ పనులు



విజయపురం ఎస్టీకాలనీలో నిర్మించిన పెదపాళెమ్మ ఆలయం



ముడిపల్లి దళితవాడలో నిర్మాణంలో ఉన్న రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయం

ముందస్తు దీపావళి వేడుకలు



సభ్యులకు సరుకులు అందిస్తున్న ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు



దీపావళి సంబరాలు చేసుకుంటున్న అసోసియేషన్ సభ్యులు

నగరి : పట్టణ పరిధిలోని ఎలక్ట్రికల్ అసోసోసియేషన్ వారు ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఏటా దీపావళికి ముందు వచ్చే ఆదివారం నాడు వారు సంబరాలు చేసుకుంటారు. ఈ మేరకు 20వ దీపావళి వేడుకలను ఆదివారం వారు ఘనంగా జరుపుకున్నారు. అసోసియేషన్ సభ్యులకు బియ్యంతో పాటు దీపావళి పిండివంటలకు అవసరమయ్యే సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో ముందుకు సాగడంతోనే 20 ఏళ్లుగా వేడుకలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఇలాగే అందరూ ఏకతాటిపై నడుస్తూ ఇంకా ఎన్నో వేడుకలను జరుపుకుందామని కోరారు. సభ్యులకు అసోసియేషన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఏఎస్ రవి, కేపీ కుమార్, అరుణగిరి, ఈశ్వరన్, మురళి, శ్రీనివాసులు, నీలగండన్, హేమాద్రి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి – పిచ్చాటూరు రోడ్డులో నడిచే ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆదివారం తిమ్మసముద్రం వద్ద మైసూరారెడ్డి, షణ్ముగం దాడి చేశారు. బాధితుడు వినోద్‌కుమార్ కేవీబీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి బయలుదేరుతున్న సమయంలో రాజీవ్‌నగర్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఫోన్ మాట్లాడుతుతూ ద్విచక్ర వాహనంలో వెళుతున్నారని తెలిపారు. పక్కకు వెళ్లాలని రెండు సార్లు హారన్ కొట్టినట్టు పేర్కొన్నారు. వారు తనను అంతు చూస్తామని బెదిరించారని తెలిపారు. తాను పట్టించుకోకుండా వెళుతుండగా తిమ్మసముద్రం వద్ద బస్సును అడ్డగించి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడిని అన్ని యూనియన్ల నాయకులు ఖండించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విధుల్లో ఉన్న వారిపై దాడి చేయడం తగదన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

బాధితుడికి సీఎంఆర్ఎఫ్ అందజేత



బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం బేరువానికండ్రిగకు చెందిన శ్రీనివాసులువర్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1 లక్ష మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. తన అనారోగ్య పరిస్థితి, వైద్యానికి అవుతున్న ఖర్చులను బాధితుడు శ్రీనివాసులువర్మ మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందేలా చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మాట్లాడుతూ తనకు సాయం అందించిన సీఎం జగనన్నకు, మంత్రి రోజమ్మకు తన కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు.

పచ్చదనం పెంపుతో పర్యావరణ రక్షణ



ఫలసాయ మొక్కలను అందిస్తున్న సంకల్పతరు ఫౌండేషన్ సభ్యులు

కార్వేటినగరం: పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సంకల్పతరు గ్రీన్‌డెక్కన్ కోఆర్డినేటర్ వీరకంఠేశ్వర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కేశవకుప్పం వద్ద వ్యవసాయ పొలంలో దానిమ్మ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతులకు కార్పొరేట్ బాధ్యత కింద ఎస్ బ్యాంకు ఆర్థిక సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఉద్యానవన మొక్కలు నాటేందుకు ముందుకొస్తే ఉచితంగా ఫలసాయ మొక్కలను పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం తిరుపతి క్లస్టర్ ఎస్ బ్యాంకు మేనేజర్లు రవిశంకర్, ధనంజయులు మాట్లాడుతూ 20 ఏళ్ల వరకు ఎస్ బ్యాంకు ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు కేశవరాజు, రవిరాజు, లక్ష్మణరాజు, సతీష్, సదాశివమండడి, పర్వేజ్, రఘు, గణేష్ పలువురు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ సంబరం

- సీఎం జగనన్న పాలనలోనే సాధ్యం
- జోరు వర్షంలోనూ ప్రజల చెంతన మంత్రి రోజా
- ప్రతి ఇంటా మంత్రికి జన నీరా'జనం'



పుత్తూరు: 9వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: సంక్షేమ పథకాల అమలుతో ప్రతి గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని, ఈ సంతోషం శాశ్వతం కావాలంటే జగనన్న సారథ్యంలోనే అది సాధ్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఇందుకు మరోసారి జగనన్నను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నుకోవల్సిన బాధ్యత సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి కుటుంబంపైనా ఉందని ఆమె స్పష్టం చేశారు. జోరు వర్షంలోనూ ఆదివారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీలోని 9వ వార్డు గోవిందపాళెం సచివాలయ పరిధిలో రెండవ రోజు కామరాజ్‌నగర్, చర్చివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. వర్షంలోనూ గొడుగు పట్టుకుని ఆమె ప్రతి గడపకు వెళ్లగా, మహిళల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. మంత్రి అందరినీ పలకరిస్తూ ముందుకు సాగారు.

శరవేగంగా అభివృద్ధి పనులు..

ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోనే పుత్తూరులో పలు అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని తెలిపారు. గేట్ పుత్తూరులో తుడా నిధులు రూ.2 కోట్లతో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఇటీవలే గోవిందమ్మ ఆలయం వద్ద రూ.56 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు గుర్తు చేశారు. గేట్ పుత్తూరు ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి విత్ ర్యాంప్‌ను సైతం త్వరలోనే ఏర్పాటు చేయనున్నటుల్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సీఎం జగనన్న సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని స్పష్టం చేశారు. వర్క్ ఆర్డర్ వచ్చిన వెంటనే పనులు ప్రారంభమవుతాయన్నారు. గేట్‌పుత్తూరు ప్రజల కోసమే రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ పనులు, రూ.1.10 లక్షలతో విద్యుత్ శ్మశాన వాటిక చివరి దశ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే వీటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల చదువుల కోసం రూ.7.65 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలను సైతం ఇదివరకే ప్రారంభించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సీఎం జగనన్న ప్రత్యేకించి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అందువల్ల మరోసారి అంతా కలిసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నగరి ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు కుప్పమ్మ, ఏకాంబరం తదితర నాయకులు పాల్గొన్నారు.



జోరు వర్షంలోనూ ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి రోజా

కమ్మేసిన మంచు



పాలసముద్రం : మండలంలోని గ్రామీణ ప్రాంతాలను ఆదివారం పొగమంచు కప్పేసింది. గత రెండు రోజులుగా ఉదయం 8.30 గంటలవుతున్నా సూర్యుడు కనిపించడం లేదు. మహిళలు ఇంటి ముందు కళ్లాపి చల్లడానికి కూడా అవకాశం లేకుండాపోయింది. రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఉదయం పూట లైట్లు వేసుకుని ముందుకు సాగారు. ఈ మంచు వల్ల వరి, వేరుశనగ తదితర పంటలకు రోగాలు సోకే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అయితే పొగమంచు వల్ల విపరీతంగా చలి పెడుతుండడంతో పిల్లలు, వృద్ధులు గజగజ వణికిపోతున్నారు.



మంచులో లైట్ వేసుకుని వెళ్తున్న వాహనదారులు, పాలసముద్రంలో పొగమంచు (ఇన్‌సెట్)